సాక్షి విశాఖపట్నం

శనివారం। 12 ఏప్రిల్। 2025



ఆర్థిక ఉగ్రవాదులను ఎందుకు రప్పించడం లేదు 10లో



విశాఖ-తిరుపతికి ప్రత్యేక రైలు 10లో

తత్కాల్ వేళల్లో మార్పులు లేవు

కొన్ని సామాజిక మాధ్యమాలలో వస్తున్న తత్కాల్ వేళలు మార్పు నిజం కాదని, ప్రస్తుతం కొనసాగుతున్న వేళల్లోనే తత్కాల్ టికెట్లు తీసుకోవచ్చని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు, రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి తత్కాల్, ప్రీమియం తత్కాల్ వేళలు మారుతున్నట్లు ఒక వార్త శుక్రవారం పలు సామాజిక మాధ్యమాలలో చక్కర్లుకొట్టింది.
-తాటిచెట్లపాలెం

న్యూస్‌రీల్

ప్రకృతిక హైడ్రోజన్‌పై ముగిసిన అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ఆచార్య విజయ్ కుమార్

విశాఖ విద్య: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) విశాఖపట్నం ఆధ్వర్యంలో 'ప్రకృతిక హైడ్రోజన్ యొక్క సమర్థవంతమైన వినియోగం- ఒక స్థిరమైన శక్తి' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమాన్ని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఇంజనీరింగ్, ఎర్త్ సైన్సెస్ విభాగం నిర్వహించింది. ఐఐపీఈ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షులు ప్రొఫెసర్ పి. కె. బానిక్, భూ శాస్త్ర మంత్రిత్వ శాఖకు చెందిన శాస్త్రవేత్త డా. నిలోయ్ ఖారే సదస్సుకు చీఫ్ ప్యాట్రన్లుగా వ్యవహరించారు. సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ కె. విజయ్ కుమార్ ఇలాంటి కార్యక్రమాలతో కలిగే ఉపయోగాలను వివరించారు. ఐఐపీఈ డైరెక్టర్ శాలివాహన్ , కో-కన్వీనర్ ప్రొఫెసర్ రోషన్ కె. సింగ్, డా. ప్రభాకర్ ఠాకూర్ ప్రసంగించారు.

జీతాల కోసం ఉద్యోగుల ఆందోళన

విశాఖ సిటీ: జీతాల కోసం బీపీవో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. శంకరమఠం, మారికవలస ప్రాంతాల్లో రెండు బీపీవో సంస్థలు జీతాలు చెల్లించడం లేదని ఉద్యోగులు నిరసన తెలిపారు. శంకరమఠం రోడ్డులో ఎల్‌టీడబ్ల్యూ సంస్థ గత ఆరేడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని ఉద్యోగులు మూడు రోజులుగా ఆందోళన చేపడుతున్నారు. శుక్రవారం వీరు నాలుగో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కంపెనీ ఉద్యోగులను పిలిపించి మాట్లాడగా.. కంపెనీ నష్టాల్లో ఉందని, మూడు నెలల తర్వాత జీతాలు ఇస్తామని చెప్పారు. పోలీసుల సమక్షంలోనే ఉద్యోగులకు రెండున్నర నెలల తరువాత జీతాలు చెల్లించేలా పోస్ట్ డేటెట్ చెక్కులు అందజేశారు. అలాగే మారికవలసలో కూడా మరో కంపెనీ 35 మంది ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఆందోళనకు దిగారు. సెక్యూరిటీ డిపాజిట్, ల్యాప్‌టాప్ కోసమని రూ.1.5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ సంస్థపై కూడా పోలీసులకు, కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఉద్యోగులు భావిస్తున్నారు.

కేజీహెచ్‌లో బాలల హక్కుల కమిషన్‌కు అవమానం

మహారాణిపేట: నగరంలోని కేజీహెచ్‌లో బాలల హక్కుల కమిషన్‌కు అవమానం జరిగింది. గత పర్యటనలో బాలల హక్కుల కమిషన్ ప్రతిపాదించిన అంశం పట్ల కమిషన్ సభ్యులకు తెలియకుండా జనన, మరణ ధ్రువీకరణ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. అయితే ఈ విషయాన్ని కమిషన్ సభ్యులకు తెలియజేయకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు. కేజీహెచ్ అధికారులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. రాజ్యాంగబద్ధమైన కమిషన్ సభ్యుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కమిషన్‌కు గౌరవం కల్పించడంలో కేజీహెచ్ అధికారులు విఫలమైనట్లు సీతారాం ఆక్షేపించారు. కేజీహెచ్ అధికారులు వ్యవహరించిన తీరుపై నేషనల్ చైల్డ్ రైట్స్ కమిషన్‌కు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామన్నారు. రాజ్యాంగ బద్ధమైన కమిషన్ పట్ల కేజీహెచ్ అధికారుల నిర్లక్ష్య ధోరణి సరికాదన్నారు. అన్ని ఆస్పత్రుల్లో బాలల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తుంటే కేజీహెచ్‌లో కొత్త రూల్స్ పెట్టడం ఇబ్బందికరంగా ఉందని సీతారామ్ అన్నారు.

జాతీయ స్థాయిలో ఏయూ విద్యార్థిని ప్రతిభ



మహాలక్ష్మిని అభినందిస్తున్న నరసింహారావు

విశాఖ విద్య: జాతీయ స్థాయి వ్యాసరచన పోటీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగానికి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థిని కోన మహాలక్ష్మి జాతీయ స్థాయిలో రెండో బహుమతిని గెలుచుకున్నారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు అనుబంధంగా పనిచేస్తున్న కర్ణాటక రాష్ట్రం ధార్వాడకు చెందిన సెంటర్ ఫర్ మల్టీ డిసిప్లినరీ డెవెలప్‌మెంట్ రీసెర్చ్ ఈ పోటీలు నిర్వహించింది. ధార్వాడలోని సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య బసవప్రభు జిర్లి చేతుల మీదుగా విద్యార్థిని మహాలక్ష్మికి రూ.7 వేలు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. మహాలక్ష్మి రాసిన వ్యాసం 'భారతీయ పురాతన విజ్ఞానం ప్రాతిపదికన ప్రాచీన సంప్రదాయాలు సమకాలీన సమస్యల' అనే అంశంపై ఆమె జాతీయ స్థాయిలో రెండో బహుమతిని పొందింది. ఆంధ్ర విశ్వవిద్యాలయ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. నరసింహారావు.. మహాలక్ష్మిని అభినందించారు.

రికార్డులనే మార్చేశారు...!




- పాత గెజిట్‌లో ఒక పేరు.. తాజాగా మరో పేరుతో ఆదేశాలు
- నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ నిర్ణయం
- రూ. 200 కోట్ల విలువైన భూమిలో చక్రం తిప్పిన కూటమి నేత
- ప్రతిఫలంగా ఆయన చేతికి ఎకరంన్నర భూమి
- భారీగా నగదు చేతులు మారినట్లు ఆరోపణలు
- ఎండాడలోని 14-1 సర్వే నంబరులోని 5.10 ఎకరాల్లో చిత్ర విచిత్రాలు

ఈ ఫొటోలో ఉన్నది కలెక్టర్ గెజిట్ నోటిఫికేషన్. ఇందులో ఎండాడలోని 14/1 సర్వే నంబరులో 5.10 ఎకరాల భూమి చెట్టిపల్లి సీతారామయ్య అసైనీగా ఉన్నారు. అయితే ఇది ప్రభుత్వ భూమి కావడం వల్ల నిషేధిత జాబితాలో ఉందని... అందువల్ల రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి గతంలో కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



ఈ ఫొటోలో ఉన్నది అదే ఎండాడలోని అదే సర్వే నంబరు...14-1లోని 5.10 ఎకరాల భూమిని వై. బాలిరెడ్డికి అసైన్ చేశారని.. దీనిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నామని, అందువల్ల రిజిస్ట్రేషన్లు చేయాలంటూ తాజాగా కలెక్టర్ జిల్లా రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు.



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అదేంటి చెట్టిపల్లి సీతారామయ్య పేరు కాస్తా బాలిరెడ్డిగా ఎలా మారిందనే అనుమానం వచ్చిందా? అనుమానాలేమీ అక్కర్లేదని... బాలిరెడ్డి పేరు మీద రిజిస్ట్రేషన్లను కూడా అనుమతించాలని కొద్దిరోజుల క్రితం జిల్లా ఉన్నతాధికారులు తేల్చి చెప్పారు. మొత్తం రికార్డుల్లోని పేరు ఎలా మారిపోయిందనే సందేహం మీకు అక్కరలేదు. ఎందుకంటే ఈ వ్యవహారంలో విశాఖ దక్షిణ నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత ఒకరు చక్రం తిప్పడమే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు ప్రతిఫలంగా సదరు నేతకు ఎకరంన్నర పొలం దక్కనుందని తెలుస్తోంది. అంతేకాకుండా ఈ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారిందనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. అంతేకాకుండా మొదట్లో అసైనీగా పేర్కొన్న చెట్టిపల్లి సీతారామయ్య కుటుంబ సభ్యులు ఏమీ మాట్లాడకుండా.. న్యాయపరంగా ముందుకెళ్లకుండా వాటాలు కూడా మాట్లాడేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తంగా రూ. 200 కోట్ల విలువైన ఈ భూమి వ్యవహారంపై లోతైన విచారణ చేస్తే మొత్తం వ్యవహారం బయటపడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రోడ్డు మూసి... చదును చేస్తున్నారు...!

ఎండాడ ప్రధాన రహదారికి కూతవేటు దూరంలోని ఈ విలువైన భూమికి వెళ్లేందుకు ఉన్న రహదారిని భవనాల నుంచి వచ్చిన డెబ్రిస్‌తో మూసేశారు. ఇక్కడ గజం భూమి విలువ లక్ష రూపాయలకుపైగానే పలుకుతోంది. అంత విలువైన ఈ భూమికి వెళ్లే దారిని మూసివేసి... లోపల మాత్రం చదును చేసేస్తున్నారు. పనోరమ హిల్స్ అపార్టుమెంట్లకు వెనకవైపు ఉన్న ఈ విలువైన భూమిలో ఇప్పుడు చదును చేసే కార్యక్రమాలు చురుకుగా సాగుతున్నాయి. ఇక్కడ భారీగా అపార్టుమెంట్లను నిర్మించేందుకు డెవెలప్‌మెంట్ అగ్రిమెంట్ కూడా సదరు కూటమి నేతనే కుదుర్చుకున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా గతంలో అసైనీగా రికార్డుల్లో పేరుండి... తాజాగా తొలగించబడిన కుటుంబ సభ్యులకు 2 వేల చదరపు గజాల స్థలాన్ని ఇచ్చేందుకు కూడా ఒత్తిడి తెచ్చి మరీ ఒప్పించారనే ఆరోపణలున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో రికార్డుల ట్యాంపరింగ్ జరిగిందా? మొత్తం రికార్డులను మాయం చేశారా అనేది లోతుగా విచారిస్తే అసలు వ్యవహారం బయటకు వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



అనేక ఆరోపణలు

వాస్తవానికి విశాఖపట్నంలో భూ రికార్డుల వ్యవహారాలపై అనేక ఆరోపణలున్నాయి. గతంలో కూడా టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో భారీగా భూ ఆక్రమణలతో పాటు రికార్డులను కూడా ట్యాంపరింగ్ చేశారనే విమర్శలున్నాయి. దీనిపై సిట్ విచారణ కూడా చేసి... ఏయే సర్వే నంబర్లల్లో ఏ విధంగా అక్రమాలు జరిగాయనే విషయాన్ని స్పష్టంగా తేల్చింది. ఈ వ్యవహారంలో అప్పటి టీడీపీ నేతలు భారీగా వ్యవహారాలు నడిపారని కూడా స్పష్టమైంది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తిరగకముందే ఏకంగా రూ. 200 కోట్ల విలువైన భూమిని ప్రభుత్వ భూమిగా ఉన్న రికార్డులను తొలగించి...ఒకప్పుడు మిలిటరీలో చేసిన వై. బాలిరెడ్డికి ప్రభుత్వం ఇచ్చిందని... కేటాయింపు చేసి అనేక సంవత్సరాలు కావడంతో నిబంధనల మేరకు నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్టు జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు అనుగుణంగా బాలిరెడ్డి పేరు మీద మొత్తం భూమిని బదలాయించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే, గతంలో పంపిన జాబితాలోని పేరుకు... తాజాగా పంపిన పేరులో తేడా ఉండటం గమనార్హం. ఈ విషయాన్ని కూడా తెలివిగా వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. సీతారామయ్య అనే వ్యక్తి పేరు కేవలం ఫారం -3లో మాత్రమే ఉందని... ఈ పేరును ఫారం -3లో నుంచి తొలగించడంతో పాటు నిజమైన అసైనీ బాలిరెడ్డి అని తేల్చిచెప్పారు. గతంలో పంపిన జాబితాలోని పేరుకు.. తాజా జాబితాలో పేరు మార్పు వ్యవహారంలో కీలకంగా కూటమి నేత వ్యవహరించినట్టు తెలుస్తోంది. ఈ విధంగా మొత్తం ఫైల్‌ను ప్రభుత్వ స్థాయిలో ఓకే చేయించినందుకు సదరు నేత ఎకరంన్నర పొలాన్ని తీసుకునేందుకు ఒప్పందం కుదిరినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వంలో కీలకంగా ఉన్న చినబాబుకు కూడా భారీ మొత్తంలో నగదు ముట్టిందనే విమర్శలున్నాయి.



సూర్యప్రభ వాహనంపై సింహాచలేశుడు 10లో

ఆస్తి పన్ను వసూళ్లలో స్టేట్ రికార్డ్

- రూ.510 కోట్లు వసూలు చేసిన అధికారులు
- జీవీఎంసీకి ఉత్తమ అవార్డు



షీల్డ్‌ను కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు అందజేస్తున్న అదనపు కమిషనర్ సోమన్నారాయణ

మహారాణిపేట: గత (2024-25) ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) ఆస్తి, ఖాళీ జాగా పన్నుల వసూళ్లలో రూ.510 కోట్లు వసూలు చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్ గురువారం ఈ అవార్డును జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మకు అందించారు. శుక్రవారం షీల్డ్‌ను కలెక్టర్/జీవీఎంసీ కమిషనర్ హరేందిర ప్రసాద్‌కు అదనపు కమిషనర్ సోమన్నారాయణ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరప్రజలు ఆస్తిపన్ను సకాలంలో చెల్లించి సహకరించడంతోనే ఈ అవార్డు లభించిందన్నారు. పన్ను వసూళ్లలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ), రెవెన్యూ అధికారులు, సిబ్బంది కృషి ఎంతో ఉందని తెలిపారు.

నేడు శ్రీవారి లడ్డూల విక్రయాలు నిలిపివేత

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో శనివారం శ్రీవారి లడ్డూల విక్రయాలను నిలిపివేస్తున్నట్లు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒంటిమెట్టలో జరగుతున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి శ్రీవారి లడ్డూలు పంపిన నేపథ్యంలో ఇక్కడ విక్రయాలు నిలిపివేశామని, ఇది భక్తులు గమనించాలని కోరారు.

పూలే సేవలు అనిర్వచనీయం

మద్దిలపాలెం: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఇసుకతోట బీసీ వసతి గృహంలో విద్యార్థులతో కలిసి కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సహపంక్తి భోజనం చేశారు. ముందుగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్వయంగా ఆహార పదార్థాలను వడ్డించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయునిస్ఫూర్తిని కాపాడుతూ ఒక తీపి గుర్తుగా ఉండాలనే ఉద్దేశంతో మీ అందరితో కలిసి భోజనం చేశానని విద్యార్థులతో అన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతికి, పేద ప్రజల సంక్షేమానికి పూలే విశేషమైన సేవలందించారని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. ఏమైనా అవసరాలు ఉంటే బీసీ సంక్షేమ అధికారిణి ద్వారా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి నాగలక్ష్మి, సహాయక బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



బీసీ హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సాక్షిపై కేసుల్ని ఖండించిన పాత్రికేయులు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సాక్షి సిబ్బంది

సీతమ్మధార: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి మీద పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని కోరుతూ విశాఖలోని జీవీఎంసీ గాంధీ పార్కులో సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాక్షి దినపత్రిక బ్యూరోచీఫ్ కేజీ రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ సాక్షి దినపత్రిక నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సాక్షి అనకాపల్లి, అల్లూరి జిల్లాల డెస్క్ ఇన్‌చార్జి బీబీ సాగర్ మాట్లాడుతూ సాక్షి ఎడిటర్‌తో సహా ఆరుగురు పాత్రికేయులపై కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య విలువలకు విఘాతమన్నారు. ఒక హత్యకేసులో బాధితుల పక్షాన నిలిచి వాస్తవాలు వెలికితీయడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. వార్తలో పేర్కొన్న విషయాల్లో నిజానిజాలను ఖరారు చేసుకుని నిందితులపై చర్యలు తీసుకోవడం మాని, పాత్రికేయులపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. జర్నలిస్టులంతా ముక్తకంఠంతో ఖండించాలని కోరారు.

ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఏటీ రామునాయుడు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో జరిగిన హత్యోదంతంలో దోషులను శిక్షించాల్సింది పోయి, వార్త కవర్‌చేసిన సాక్షి జర్నలిస్టుల పైనా, మీడియాపైనా కేసులు నమోదుచేయడం సరికాదన్నారు. సాక్షి ఎడిటర్‌తో పాటు జర్నలిస్టులపై నమోదైన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకుడు డి.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వార్త కవర్ చేసిన సాక్షి మీడియా జర్నలిస్టులపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. సీనియర్ జర్నలిస్టు పిల్లా విజయకుమార్ మాట్లాడుతూ యాజమాన్యాల మీద ఉన్న కోపాన్ని వృత్తి ధర్మం నిర్వహిస్తున్న పాత్రికేయులపై ప్రదర్శించడం సరికాదని హితవు పలికారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అనుబంధ ఎలక్ట్రానిక్ మీడియా విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.అనేష్ కుమార్, ఏపీడబ్ల్యూజే అనుబంధ సామ్నా జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణకిశోర్, భీమిలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమణప్రసాద్, పలు ప్రెస్‌క్లబ్‌ల కార్యవర్గసభ్యులు, అధిక సంఖ్యలో పలు మీడియాలకు చెందిన పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

నిలకడలేని సేన

- మలేషియాకు చెక్కేసిన జనసేన కార్పొరేటర్లు
- మాట నిలుపుకోని వైనం
- క్యాంప్ రాజకీయాలు చేయబోమని చెప్పిన మంత్రి నాదెండ్ల
- చెప్పిన నాలుగు రోజుల్లోనే విమానమెక్కిన ఏడుగురు జనసేన కార్పొరేటర్లు
- టీడీపీ కార్పొరేటర్లతో కలిసి ప్రయాణం
- ఆదివారం మరికొంత మంది పయనం



మలేషియా విమానం ఎక్కేందుకు కుటుంబ సభ్యులతో సిద్ధంగా ఉన్న టీడీపీ కార్పొరేటర్లు



ఎయిర్‌పోర్టులో జనసేన కార్పొరేటర్‌ను దగ్గరుండి మరీ పంపిస్తున్న టీడీపీ కార్పొరేటర్లు

విశాఖ సిటీ: యథారాజా తథా ప్రజా అన్న నానుడి జనసేన నేతలకు సరిగ్గా సరిపోతుంది. నిలకడలేని మాటలు, రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. ఏ జిల్లాకు వెళితే ఆ జిల్లాలోనే పుట్టానని.. ఒక్కో సభలో ఒక్కో చదువు చదివానని చెప్పిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో మీమర్లకు ఫుల్‌మీల్స్‌గా మారితే.. ఆ పార్టీ నంబర్-2 నాలుక కూడా నాలుగు రోజుల్లో మడతపెట్టేశారు. విశాఖ మేయర్‌పై అవిశ్వాస ఓటింగ్ వ్యవహారంలో జనసేన క్యాంప్ రాజకీయాలు చేయదని చెప్పిన కొన్ని గంటల్లోనే ఆ పార్టీ కార్పొరేటర్లు విమానమెక్కి చెక్కేయడం గమనార్హం. కార్పొరేటర్లు చేజారిపోతారన్న భయంతో టీడీపీ నేతలే దగ్గరుండి మరీ విమాన టికెట్లు తీయించి మలేషియా విమానం ఎక్కించారు.

నిలకడ లేని మాటలు..

జనసేన పార్టీకి ఓ విధానం, నేతల మాటలకు ఓ నిలకడ లేనట్లు మరోసారి రుజువైంది. అధ్యక్షుడి బాటలోనే కార్పొరేటర్లు నడుస్తూ జిల్లాలో మేయర్ పీఠాన్ని టీడీపీ చేతుల్లో పెట్టేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. అయితే కొద్ది రోజుల క్రితమే జనసేన కార్పొరేటర్లు విజయవాడలో పవన్ కల్యాణ్‌ను కలిశారు. అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేయాలని హామీ తీసుకున్నారు. తాము క్యాంపు రాజకీయాలు చేయబోమని, తమ కార్పొరేటర్లపై పూర్తి నమ్మకముందని గొప్పలు చెప్పుకొచ్చారు. అది జరిగిన కొద్ది రోజుల్లోనే మంత్రి నాదెండ్ల మనోహర్ విశాఖకు వచ్చి జనసేన కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈయన కూడా క్యాంప్ రాజకీయాలకు జనసేన దూరమని పునరుద్ఘాటించారు. చెప్పిన కొద్ది గంటలకే మాట మార్చారు. అందరినీ విదేశాలకు పంపించాలని నిర్ణయించారు.

ఓటమి భయం

జీవీఎంసీ మేయర్ పీఠాన్ని దక్కించుకోడానికి కూటమి నేతలు కుట్ర రాజకీయాలు తెరతీస్తున్నారు. కౌన్సిల్‌లో బలం పెంచుకోడానికి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు ఎర వేస్తున్నారు. లొంగని వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. అయినప్పటికీ.. అవిశ్వాసానికి మద్దతుగా 58 కార్పొరేటర్ల మద్దతు ఉందని కూటమి నేతలు జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఈ నెల 19వ తేదీన అవిశ్వాస ఓటింగ్‌కు ప్రత్యేక కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కార్పొరేటర్లకు నోటీసులు పంపించారు. ఇదిలా ఉంటే.. కొంత మంది కార్పొరేటర్లు కూటమిలో ఇమడలేక బయటకు వచ్చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో టీడీపీ నేతలు ఇప్పటికే కొంత మంది కార్పొరేటర్లను మలేషియా పంపించారు. జనసేన కార్పొరేటర్లు కూడా మనసు మార్చుకోకముందే విదేశాలకు పంపించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఏడుగురు జనసేన కార్పొరేటర్లకు మలేషియా టికెట్ బుక్ చేసి శుక్రవారం సాయంత్రం దగ్గరుండి మరీ విశాఖ ఎయిర్‌పోర్టులో విమానం ఎక్కించారు. ఆదివారం టీడీపీ కార్పొరేటర్లతో కలిపి మిగిలిన జనసేన కార్పొరేటర్లను కూడా మలేషియా పంపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

బాంబు పేల్చిన కూటమి కార్పొరేటర్

ఒకవైపు అవిశ్వాస ఓటింగ్‌కు కార్పొరేటర్లు చేజారిపోకూడదని కూటమి నేతలు క్యాంప్ రాజకీయాలు చేస్తుంటే.. మరోవైపు అదే కూటమికి చెందిన 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ బాంబు పేల్చారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నట్లు 58 మంది సంతకాలు చేసినట్లు కలెక్టర్ నోటీసులో పేర్కొని, ఆ తీర్మానం కాపీని సభ్యులకు అందించలేదన్న విషయాన్ని ప్రస్తావించారు. కలెక్టర్ కార్పొరేటర్లకు ఇచ్చిన ఫారం-2 నోటీసులో 58 మంది సభ్యులు సంతకం చేసిన ప్రతిపాదిత అవిశ్వాస తీర్మానం కాపీని జత చేసినట్లు చెప్పారని, కానీ అటువంటి మోషన్ కాపీ జత చేయలేదని అభ్యంతరం తెలిపారు. అవిశ్వాస తీర్మానానికి సంతకం చేసిన 58 మంది సభ్యుల సంతకాల ఆధారాలు సమర్పించని పక్షంలో ఆ నోటీసు 1955 మున్సిపల్ కార్పొరేషన్ చట్టం ప్రకారం ఎవరైనా ప్రశ్నిస్తే కోర్టు ముందు నిలబడకపోవచ్చన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ చట్టంలో పేర్కొన్న విధానాన్ని అనుసరించి పునఃపరిశీలించాలని కోరారు. అవిశ్వాస ఓటింగ్ ప్రక్రియలో చట్టపరమైన సమస్యలకు అవకాశం ఇవ్వకుండా ప్రత్యేక సమావేశాన్ని సరైన పద్ధతిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాజకీయ నాయకులే ప్రజలకు పెద్ద సమస్య

- మాజీ డీజీపీ పూర్ణ చంద్రరావు


మాట్లాడుతున్న మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు

సీతమ్మధార: ఉత్తరాంధ్రలో రాజకీయ నాయకులే ప్రజలకు పెద్ద సమస్యగా మారారని, వారు తమ కులాలకే నాయకులుగా పనిచేసే పరిస్థితి నెలకొందని మాజీ డీజీపీ పూర్ణ చంద్రరావు ఆక్షేపించారు. బీఎస్పీ, బీసీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన బీసీ సమరభేరీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు కుటుంబాల్లోని మహిళల గురించే చర్చలు జరుగుతున్నాయని, మిగిలిన వారు మహిళలు కాదా అని ప్రశ్నించారు. ప్రజల దృష్టిని వాళ్ల వైపే మళ్లిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రలో అత్యధిక శాతం బీసీలు ఉన్నారని, అయినా కమ్మ నాయకుల మాటే ఉత్తరాంధ్రలో చెల్లుతుందని ఆరోపించారు. షేక్‌లకు అమ్మాయిలను అమ్ముతున్నట్లు అదానీకి విశాఖ స్టీల్ ప్లాంటును అమ్ముతున్నారని కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కమ్మరాజు ఎంపీ భరత్ దీని గురించి ఏమీ పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ కాబట్టే ఆయన మాట చెల్లుబాటు కావడం లేదన్నారు. కామ్మ, రెడ్డిల ఉత్తరాంధ్ర అయిపోయిందని, కమ్మ వ్యక్తి శ్రీకాకుళంలో ఎమ్మెల్యే ఎట్లా అయ్యాడని ప్రశ్నించారు. రాష్ట్రంలో 35 మంది కమ్మ ఎమ్మెల్యేలు, 32 మంది రెడ్డిలు ఉన్నట్లు పేర్కొన్నారు. పార్లమెంటులో వక్ఫ్ బిల్ వచ్చిన తర్వాత చర్చ కూడా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పి.శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బి.విశ్వనాథ్, ఉపాధ్యక్షుడు ధనుంజయ్, జిల్లా కోశాధికారి రామచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు పెద్దాడ కనకమహాలక్ష్మి, శరత్, అన్నవరం చిన్నారావు, రమేష్, పలు ప్రజాసంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్ష నెరవేర్చేలా 'స్వర్ణాంధ్ర 2047 విజన్'

- కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: క్షేత్రస్థాయి పరిస్థితులు, అవసరాలను పరిగణలోకి తీసుకుని.. నియోజకవర్గ స్థాయి స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మే 15 నాటికి అన్ని పనులను పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాల అధికారులకు వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి అంశాలను అవగతం చేసుకుంటూ.. ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల పరిధిలో పని చేయాల్సిన అధికారుల బృందాలను ప్రకటించారు. జిల్లాకు కలెక్టర్ చైర్మన్‌గా, నియోజకవర్గానికి డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా, ఆయా జోనల్ లేదా మండల స్థాయిలో జోనల్ కమిషనర్, ఎంపీడీవోలు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని, ఒక్కో కమిటీలో ఐదుగురు సచివాలయ సిబ్బంది ఉంటారని వెల్లడించారు. వీరంతా కలిసి స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికకు అనుగుణంగా తాత్కాలిక వార్షిక ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఆయా నియోజకవర్గాల్లోని ప్రజల అవసరాలను ప్రధానంగా పరిగణలోకి తీసుకోవాలని, భవిష్యత్ రూపురేఖలు మార్చే విధంగా ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి, మూడు జిల్లాల ఉన్నత స్థాయి అధికారులు, ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లు, ప్రణాళిక విభాగం అధికారులు, సీపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై సింహాచలేశుడు


కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా 5వరోజు శుక్రవారం స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. స్వామి కల్యాణ ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం సింహగిరి మాడ వీధిలో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు రాజీవ్‌లోచన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి మృగయోత్సవం నిర్వహించనున్నారు.

ఫేక్ ఇన్‌వాయిస్‌లపై ఉక్కుపాదం

- పన్ను ఎగవేతదారుల నుంచి ప్రతిపైసా వసూలు
- 2024–25లో రూ.158 కోట్ల రికవరీ చేశాం
- 2023–24లో రూ.71 కోట్ల రికవరీ
- పన్ను ఎగవేతదారుల సంఖ్య తగ్గుతోంది
- ఏఐ సహకారంతో ప్రతి ఇన్‌వాయిస్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం
- సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనంద్‌కుమార్



సాక్షి, విశాఖపట్నం : తప్పుడు ఇన్‌వాయిస్‌లతో జీఎస్టీ ఎగ్గొట్టేందుకు ప్రయత్నించే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతున్నామని సీజీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ స్పష్టం చేశారు. కమిషనరేట్ ఏర్పాటు చేసి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సీజీఎస్టీ భవన్‌లో ఆయన మీడియా సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. పన్ను ఎగవేతదారుల్ని పట్టుకొని..వారి నుంచి రికవరీ చేస్తున్న మొత్తం గణనీయంగా పెరుగుతోందని స్పష్టం చేశారు. ఫలితంగా పన్ను ఎగవేతదారుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోందనీ.. జీఎస్టీ ఆడిట్ అంటే భయం పెరుగుతోందన్నారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ అనంతరం వచ్చే ప్రతి ఇన్‌వాయిస్‌ని కమిషనరేట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు డేటా ఇంటెలిజెన్స్ వినియోగిస్తూ.. తప్పుడు ఇన్‌వాయిస్‌లను పొందుపరిచిన వారి గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా ఎగ్గొట్టిన జీఎస్టీని చెల్లించకపోతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆనంద్‌కుమార్ స్పష్టం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

ఇక బిల్డర్లకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ అవకాశం లేదు

బిల్డర్లు తమ రియల్ వ్యాపార సమయంలో బిల్డింగ్ మెటీరియల్ కొనుగోలు పేరుతో తప్పుడు ఇన్‌వాయిస్‌లు సృష్టించిన కేసులు వస్తున్నట్లు గుర్తించాం. ఈమధ్య కాలంలో ఆడిట్ విభాగం విశాఖ సర్కిల్ పరిధిలో 651 కేసులు గుర్తిస్తే.. అందులో 25 శాతం వరకూ బిల్డర్ల కేసులే ఉన్నాయి. ప్రతిచోటా ఈ తరహా కేసులు పెరుగుతుండటంతో.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందే అవకాశాన్ని బిల్డర్లకు కేంద్రం రద్దు చేసింది.

పోలవరం, అమరావతి నిర్మాణానికి జీఎస్టీ కారణం

మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడంలో ప్రభుత్వానికి జీఎస్టీ ప్రధాన వనరుగా మారింది. 2025–26లో జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు. సామాజిక మౌలిక సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.11 లక్షల కోట్లలో సింహభాగం జీఎస్టీ నుంచి వచ్చిందే. ఏపీ విషయానికి వస్తే.. అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మించడానికీ జీఎస్టీ ద్వారా వచ్చిన నిధుల్నే వినియోగిస్తున్నారు. చిన్న పరిశ్రమల ఆడిటింగ్ 2023–24లో 414 యూనిట్లుండగా.. 2024–25లో 118కి తగ్గాయి. మధ్యతరహా పరిశ్రమల ఆడిటింగ్ 101 నుంచి 196కి, భారీ పరిశ్రమలు 224 నుంచి 286కి పెరిగాయి. పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ నుంచి వచ్చే ఆదాయాన్ని కోల్పోయేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా లేవు. అందుకే ఈ తరహా ఇంధనాలు జీఎస్టీ పరిధిలోకి రావడం ఆలస్యమవుతోంది. ఈ అంశంపై చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక కమిటీ త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం.

రెట్టింపు శాతంలో రికవరీ చేశాం

జీఎస్టీ శాతాలు తగ్గింపు, రేషనలైజేషన్‌పై జీఎస్టీ కౌన్సిల్ చర్చలు జరుపుతోంది. త్వరలోనే జీఎస్టీ తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఏపీలోని 5 సర్కిల్ పరిధిలోని 25 సీజీఎస్టీ ఆడిట్ గ్రూప్‌ల నుంచి గతేడాదితో పోలిస్తే ఆదాయం రెట్టింపైంది. ఫేక్ ఇన్‌వాయిస్‌లకు సంబంధించిన వారి నుంచి 2023–24లో రూ.71.92 కోట్లు రికవరీ చేయగా.. 2024–25లో రూ.158.58 కోట్లు వసూలు చేశాం. 2023–24 కాలంలో తప్పుడు ఇన్‌వాయిస్‌లు పొందుపరిచిన వారు 714 మంది ఉండగా.. 2024–25లో ఈ సంఖ్య తగ్గి 600కి తగ్గింది. అదే విధంగా.. జీఎస్టీ ఎగవేత మోసాలు 2023–24లో రూ.2,682.11 కోట్లు ఉండగా.. 24–25లో ఇది కూడా తగ్గి కేవలం రూ.1505.38 కోట్లకు పరిమితమైంది. 2025–26లో రికవరీ టార్గెట్ రూ.300 కోట్లుగా నిర్దేశించుకున్నాం.

జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం

- కలెక్టర్ హరేందిర ప్రసాద్


బీసీ కార్పొరేషన్ లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్


పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ బాబూరావు, మాజీ మంత్రి కారుమూరి, పార్టీ ముఖ్య నేతలు

మహారాణిపేట: అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు బలహీనవర్గాల అభ్యున్నతికి, మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పూలే జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూలే జాతికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సమాజంలో అంటరానితనం నిర్మూలనకు కృషి చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వంటి మహోన్నత వ్యక్తి సైతం పూలేను ఆదర్శంగా తీసుకున్నారన్నారు. అనంతరం బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఇతర కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కింద 50 శాతం బ్యాంకు రుణం, 50 శాతం ప్రభుత్వ రాయితీతో 400 యూనిట్లకు గాను రూ.10.45 కోట్ల విలువైన చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ బ్యాంకుల అధికారులను కలెక్టర్ సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మధుసూదనరావు, రామ్మోహన్ నాయుడు, ఎ.కృష్ణ, ఎం.రవికుమార్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గొప్ప సామాజికవేత్త పూలే

మహారాణిపేట: గొప్ప సామాజిక వేత్త మహాత్మా జ్యోతిరావు పూలే అని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్ ఆధ్వర్యంలో మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ఎంపీ గొల్ల బాబూరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పూలే ఆశయాలను వైఎస్ జగన్ కొనసాగించారని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు జాన్ వెస్లీ, పేర్ల విజయ్ చంద్ర, పార్టీ ముఖ్య నాయకులు కొండా రాజీవ్ గాంధీ, జహీర్ అహ్మద్, జిల్లా అధికార ప్రతినిధులు అహ్మద్, మొల్లి అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు మంచా మల్లేశ్వరి, పతివాడ కనకరాజు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పేడాడ రమణికుమారి, మారుతీ ప్రసాద్, కె.రాంరెడ్డి, సేనాపతి అప్పారావు, దేవరకొండ మార్కండేయులు, ఎండీ షరీఫ్, పార్టీ నాయకులు బొండా శీను, పత్తిపాడు వెంకటలక్ష్మి, సత్యవతి, భాను తదితరులు పాల్గొన్నారు.

సిటీ పోలీస్, ఏపీఈపీడీసీఎల్ జట్ల ఘన విజయం

విశాఖ స్పోర్ట్స్: వీడీసీఏ ఇనిస్టిట్యూషన్స్ లీగ్ టీ20లో సిటీ పోలీస్ జట్టు 12 పరుగుల తేడాతో గీతం కళాశాల జట్టుపై, ఏపీఈపీడీసీఎల్ జట్టు 66 పరుగుల తేడాతో షిప్ బిల్డింగ్ సెంటర్ జట్టుపై విజయం సాధించాయి. గీతం కళాశాల మైదానంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సిటీ పోలీస్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసింది. అనిష్ (62) అర్ధ శతకం సాధించాడు. ప్రతిగా గీతం జట్టు నాలుగు వికెట్లు కోల్పోయి 142 పరుగులకు ఇన్నింగ్స్ ముగించింది. జాన్ (51), అభిషేక్ (56) అర్ధశతకాలు సాధించారు. సిటీపోలీస్ బౌలర్ ఎల్. శ్రీను మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వైఎస్సార్ స్టేడియం 'బి'మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ఈపీడీసీఎల్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఆరు వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసింది. అరుణ్ (68) అర్ధశతకం సాధించాడు. సంజీత్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా షిప్ బిల్డింగ్ సెంటర్ జట్టు 135 పరుగులకే కుప్పకూలింది. అభిషేక్ నాలుగు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రత్యర్థి జట్లు ఆటకు రాకపోవడంతో వీసీటీపీఎల్, వీఏసీ జట్లు వాకోవర్ విజయాలను అందుకున్నాయి.

విశాఖ-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: వేసవి సీజన్ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.


- విశాఖపట్నం–తిరుపతి(08547) వీక్లీ స్పెషల్ ప్రతీ బుధవారం రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 28వ తేదీ వరకు నడుస్తుంది. తిరుపతి–విశాఖపట్నం(08548)స్పెషల్ ప్రతీ గురువారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 29వ తేదీ వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం–కర్నూలు సిటీ(08545) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి మంగళవారం రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.35 గంటలకు కర్నూలు సిటీకి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 27 వరకు నడుస్తుంది. కర్నూలు సిటీ–విశాఖపట్నం(08546) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం సాయంత్రం 4.10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ మే 28 వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం–ఎస్ఎంవీ బెంగళూరు(08581) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.20 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 25వ తేదీ వరకు నడుస్తుంది. ఎస్ఎంవీ బెంగళూరు–విశాఖపట్నం (08582) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మురుసటి రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మే 26వ తేదీ వరకు నడుస్తుంది.

ఆర్థిక ఉగ్రవాదులను ఎందుకు రప్పించడం లేదు?

- ప్రధాని మోదీకి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సూటి ప్రశ్న
- దేశంలోనే సంపన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- పవన్ కల్యాణ్ చేగువేరా నుంచి సావర్కర్‌గా మారారు

సీతమ్మధార: ముంబయి ఉగ్రదాడుల నిందితుడు తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి రప్పించిన ప్రధాని మోదీ.. ఆర్థిక ఉగ్రవాదులను మాత్రం విదేశాల నుంచి రప్పించడం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో ఆర్థిక నేరాలకు పాల్పడిన 29 మందిలో 28 మంది గుజరాత్ వారేనని, వారిలో కొందరు మోదీ పేరున్నవారేనని నారాయణ ఆరోపించారు. ప్రజల సొమ్మును దోచుకున్న వీరంతా ఉగ్రవాదుల కంటే ప్రమాదకరమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చే నాటికి రెండున్నర లక్షల కోట్లుగా ఉన్న నిరర్థక ఆస్తుల విలువ.. ఈ 11 ఏళ్లలో రూ.16.5 లక్షల కోట్లకు పెరిగిందని ఆరోపించారు. దేశంలో బీజేపీ పలుకుబడి, మోదీ ఇమేజ్ తగ్గిందని, వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతో సున్నితమైన అంశాలను రెచ్చగొడుతున్నారని ఆయన ఆరోపించారు. గుజరాత్‌లో హత్య కేసులో శిక్షపడి బహిష్కరణకు గురైన అమిత్ షా.. ఆ కేసు నుంచి బయటపడేందుకు 12 మందిని చంపించారని నారాయణ ఆరోపించారు. అలాంటి వ్యక్తి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని అంతం చేస్తామని చెప్పడం అవివేకమన్నారు. మావోయిస్టులను చంపితే సిద్ధాంతం బతికే ఉంటుందని.. మరికొందరు మావోయిస్టులు పుట్టుకొస్తారని చరిత్ర చెబుతోందన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధి ద్వారానే నక్సలిజం అంతమవుతుందని నారాయణ అన్నారు. దేశంలో సంపద కొద్దివర్గాలకే పరిమితమైందని, దళితులు, గిరిజనులు, మధ్యతరగతి ప్రజల పరిస్థితి మారలేదన్నారు.పార్లమెంటు సభ్యుల్లో 92 శాతం మంది సంపన్నులేనని, దేశంలో సంపన్న ముఖ్యమంత్రి చంద్రబాబు అని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, లౌకిక రాజ్యాన్ని ధ్వంసం చేస్తున్నా చంద్రబాబు, జగన్, పవన్‌లు మౌనంగా ఉన్నారని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేగువేరా నుంచి సావర్కర్‌గా మారారని, సనాతన ధర్మం గురించి ఆయనకు తెలుసా అని ప్రశ్నించారు. కేంద్రం ఆమోదించిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా శనివారం దేశవ్యాప్తంగా బిల్లు ప్రతులను దగ్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, విశాఖ ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, ఎ.విమల, ఎస్.కె.రెహమాన్, చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జె.డి. నాయుడు, ఎస్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుడి అనుమానాస్పద మృతి


నాగేశ్వరావు మృతదేహం

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడని పరిశ్రమ యాజమాన్యం చెబుతుండగా, విష వాయువులు పీల్చడం వల్లే మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. వివరాలివి. అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి చెందిన బావురిశెట్టి నాగేశ్వరరావు(55) గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో మూడేళ్లుగా క్లీనింగ్ పనులు చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం క్లీనింగ్ పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి కింద పడిపోయాడు. తోటి కార్మికులు ఈ విషయాన్ని పరిశ్రమ యాజమాన్యానికి తెలియజేయగా, నాగేశ్వరరావును వైద్య పరీక్షల నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే నాగేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగేశ్వరరావుకు భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఒక అమ్మాయికి వివాహం అయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు కింద నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా.. కాంట్రాక్టు కార్మికుడి మృతిపై సమగ్ర విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.

మూర్తి యాదవ్ నోరు అదుపులో పెట్టుకో..


- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ హెచ్చరిక



మహారాణి పేట: జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ హెచ్చరించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్పొరేటర్ మూర్తి యాదవ్ తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడే మూర్తి యాదవ్‌కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయంటూ మూర్తి యాదవ్‌ను తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలన, 11 నెలల కూటమి పాలన గురించి ప్రజలను అడిగితే చెబుతారని, బావిలో కప్పలా మా పాలన బాగుందని కూటమి నేతలు, నాయకులు అంటే సరిపోదన్నారు. కూటమి పాలనలో మోసాలు, దౌర్జన్యాలు, మహిళలపై దాడులను ప్రజలు చూస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్ పాలనలో విశాఖలో జరిగిన అభివృద్ధి, చంద్రబాబు ముఖ్యమంత్రిగా పని చేసిన 15 ఏళ్ల పాలనలో విశాఖలో జరిగిన అభివృద్ధి గురించి చర్చిద్దామా అని ఆల్ఫా కృష్ణ సవాల్ విసిరారు.

దోపిడీకి పాల్పడిన బాలుడి అరెస్ట్


- ర్యాపిడో డ్రైవర్‌పై దాడి ఘటన


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నగదు


వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ లతామాధురి

ఉక్కునగరం: ర్యాపిడో డ్రైవర్‌పై దాడి చేసి దోపిడీకి పాల్పడిన బాలుడిని అరెస్ట్ చేసినట్లు నగర క్రైం డీసీపీ కె.లతా మాధురి తెలిపారు. ఈ నెల 10న స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ రహదారిలో ర్యాపిడో డ్రైవర్‌పై మైనర్ దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. గాజువాక సౌత్ ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ కేసు వివరాలు వెల్లడించారు. పార్ట్‌టైం ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్న కిశోర్ ఆ రోజు రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా శ్రీనగర్ పెట్రోల్ బంక్ వద్ద బాలుడు స్టీల్‌ప్లాంట్ లోపలికి రైడ్ మాట్లాడుకున్నాడు. స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్మశానం వద్ద బైక్ ఆపమని చెప్పి, ఆ బాలుడు కిశోర్‌పై దాడి చేసి ఫోన్ లాక్కున్నాడు. ఆ ఫోన్ ద్వారా ముగ్గురికి రూ.48,100 ఫోన్‌పే ద్వారా పంపాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదుతో క్రైం సిబ్బంది వెంటనే అప్రమత్తమై దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో పెదగంట్యాడ సమతా నగర్‌లోని సాయిబాబా గుడి దగ్గరలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నేరాన్ని అంగీకరించిన బాలుడి నుంచి రూ.48,100 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. చెడు అలవాట్లకు బానిసై.. సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో బాలుడు దోపిడీకి పాల్పడినట్లు డీసీపీ తెలిపారు. డెలివరీ బాయ్స్, ర్యాపిడో, ఓలా తదితర డ్రైవర్లు రాత్రి సమయాల్లో అపరిచితులను నమ్మి లిఫ్ట్ ఇవ్వొద్దని సూచించారు. ఈ సందర్భంగా బాలుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఈ నెల 24 వరకు రిమాండ్ విధించారు. అనంతరం అతన్ని జువనైల్ హోమ్‌కు తరలించినట్లు క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో ఏడీసీపీ క్రైం మోహనరావు, ఏసీపీ జోన్-2 క్రైం డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభం


ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎండీ అగర్వాల్

ఎంవీపీకాలనీ: వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో వినియోగించే ఇంజినీరింగ్ ఉత్పత్తుల ప్రదర్శన శుక్రవారం ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా ప్రారంభమైంది. ఇండోర్ ఇన్ఫో లైన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 13 వరకు ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇండోర్ ఇన్ఫో లైన్ ఎండీ ఆర్‌కే అగర్వాల్‌తో పాటు పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొని ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్‌తో పాటు వీఏఎస్ఏ స్ఐడబ్ల్యూఏ తదితర అసోసియేషన్లు ఈ ప్రదర్శనకు మద్దతుగా నిలిచినట్లు అగర్వాల్ తెలిపారు. ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులను ఆయా సంస్థలు రాయితీపై విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నగర వినియోగదారులు ఈ ఉత్పత్తులను తిలకించవచ్చన్నారు. పలు పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.